# కార్యకర్తలు ముందుండి పనిచేయాలి

- గెలిచినా ఓడినా ఎల్లప్పుడూ ప్రజల వెంటే బీఆర్ఎస్
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, డిసెంబర్ 26: హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రధాన ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు, నాయకులు ముందుండి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచినా ఓడినా ఎల్లప్పుడూ ప్రజల వెంట ఉండి వారికి అండగా ఉండేది కేవలం బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. గడిచిన పదేండ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కొంత నిర్లక్ష్యంగా జరిగిందన్నారు. గ్రామాలు, మండలాలు అనే వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఏ ఒక్క రూపాయి ఆశించకుండా పనిచేశామన్నారు. కొద్దిపాటి తేడాతో ఓటమికి గురయ్యామని, అయినా కార్యకర్తలు ఏమాత్రం ఆత్మస్థైర్యాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నో హామీలు ఇచ్చారని, అవన్నీ నెరవేర్చాలన్నారు. పొట్లపల్లి శివాలయం ముందు హుస్నాబాద్‌లో తాను చేయబోయే పనులు, అమలు చేయబోయే సంక్షేమ పథకాలపై బాంబ్ పేపర్ రాసి ప్రమాణం చేసిన పొన్నం ప్రభాకర్ తూచ తప్పకుండా వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్రభుత్వం నిర్వహించబోయే ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజల సమస్యలను కార్యకర్తలు ప్రస్తావించాలన్నారు. జనవరి 7వ తేదీన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నామని, ఆ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుందామని కార్యకర్తలకు చెప్పారు. సమావేశంలో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీలు మాలోతు లక్ష్మీబీలూనాయక్, కీర్తిసురేశ్, అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వంగ వెంకట్రాంరెడ్డి, పెసరు సాంబరాజు, మామిడి అంజయ్య, ఆవుల మహేందర్, నాయకులు ఆకుల వెంకట్, ఎండీ అన్వర్, చిట్టి గోపాల్‌రెడ్డి, ఎడబోయిన తిరుపతిరెడ్డి, పొన్నాల లక్ష్మణ్, తిప్పారపు శ్రీకాంత్, మల్లికార్జున్‌రెడ్డి, గవ్వ వంశీధర్‌రెడ్డి, వాల సుప్రజ, స్వరూప, బొజ్జ హరీశ్, శంకర్‌రెడ్డి, లింగాల సాయన్న, బొల్లి శ్రీను, అయూబ్, చిరంజీవి, వికాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**అయ్యప్ప ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు**

హుస్నాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరగుట్టపై అయ్యప్ప స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూజలు చేసి హారతి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అనంతరం అయ్యప్పస్వాములతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎమ్మెల్యే వెంట సిద్దిపేట జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఎడబోయిన తిరుపతిరెడ్డి, గవ్వ వంశీధర్‌రెడ్డి, వాల సుప్రజ ఉన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

హత్నూర, డిసెంబర్ 26: మండల కేంద్రమైన హత్నూర–మాధుర శివారులోని దత్తాచల క్షేత్ర బ్రహ్మోత్సవాలు వారం రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం దత్తజయంతిని పురస్కరించుకొని దత్తాచలక్షేత్రం వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ రాష్ట్ర లేబర్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. దత్తాచలక్షేత్రానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం క్షేత్రం వద్ద జరిగిన చండీహోమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, బుచ్చిరెడ్డి, దుర్గారెడ్డి, రవి, రమేశ్‌నాయక్, కిష్టయ్య, రాజు, ఆగమయ్య, విప్లవ్‌ఖన్నా, వెంకటేశం గుప్తా, నరేందర్, అర్జున్, అజ్జు పాల్గొన్నారు.

**పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి**

ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం హత్నూర రైతువేదిక వద్ద జరిగిన ప్రజాపాలన మండల స్థాయి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి స్వప్న, తహసీల్దార్ సంధ్య, ఎంపీడీవో శారదాదేవి పాల్గొన్నారు.



దత్తాచలక్షేత్ర బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**అధికారుల నిలదీత**

హత్నూర రైతువేదికలో నిర్వహించిన ప్రజాపాలన మండలస్థాయి సమావేశం సందర్భంగా సభా వేదిక వద్ద ఏర్పాటుచేసిన బ్యానర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ముద్రించి స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో ముద్రించకపోవడంతో పలువురు ప్రజాప్రతినిధులు జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేక అధికారిని స్వప్నను నిలదీశారు.

# ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం తప్పనిసరి



తొలి పరుగు శిక్షణ పొందిన వారితో ఐపీఎస్ అధికారి శ్వేత, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట, డిసెంబర్ 26: ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం తప్పనిసరి అని ఐపీఎస్ అధికారి శ్వేత అన్నారు. అక్టోబర్ 1న ప్రారంభించిన తొలి పరుగు ముగింపు కార్యక్రమం మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన మహిళలతో 5కే రన్‌లోపాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్స్, టీషర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఐపీఎస్ శ్వేత మాట్లాడుతూ సెకండ్ ఎడిషన్ మారథాన్ పోటీలకు మహిళలందరూ సిద్ధం కావాలన్నారు. జీవితంలో ఆరోగ్యాన్ని మించింది మరొకటి లేదని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి డబ్బుల వ్యామోహంలో పడి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దన్నారు. 24 గంటల్లో ఒక గంట సమయాన్నిఆరోగ్యం కోసం కేటాయించాలన్నారు.ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. శారీరక శ్రమ నిత్య జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఆరోగ్యాన్ని పది కాలాలపాటు పదిలంగా కాపాడుకోవడానికి ఆక్టివ్ లైఫ్ స్టైల్ మనందరి జీవితంలో విడదీయరాని, విశేషమైన భాగంగా మారాలని సూచించారు. పరుగెత్తడం జీవితంలో విడదీయరాని భాగంగా మార్చుకోవాలన్నారు. 70 ఏండ్ల వయస్సులో కూడా మారథాన్ పరుగు చేయగల శారీరక పటుత్వం సాధించాలన్నారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల బాపురెడ్డి, మహిళా రన్నర్స్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పన్యాల రాజిరెడ్డి, ముత్యాల సురేందర్‌రెడ్డి, పాతూరి సుజాత, మాలతి, రమాదేవి, గీతాదేవి, సతీశ్, కేవీఎన్ రెడ్డి, సునంద, లక్ష్మణ్, వనజ, అరుణ , జ్యోతిర్మయి, శ్రీనివాస్, రాంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో వైభవంగా పడిపూజ




హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 26: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీసిద్ధేశ్వరస్వామి గుట్టపై వెలిసిన అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వెంకటేశ్వరశర్మగురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, అయ్యప్పస్వాములు నర్సింహస్వామి, వెంకటరమణ, నాగభూషణం, శ్రీధర్, నరేందర్, సంపత్, శివరాం, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్‌తోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్యాణోత్సవానికి కొమురవెల్లి ముస్తాబు

- రంగులు వేస్తున్న కార్మికులు
- మూడు వేల కల్యాణ పత్రికలు పంపిణీ

చేర్యాల, డిసెంబర్ 26 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం కల్యాణోత్సవానికి ముస్తాబవుతున్నది. మంగళవారం స్వామి వారి క్షేత్రంలోని ఆలయ పరిసరాల్లో ఉన్న ప్రకారం, రాజగోపురం, పాదాల మండపం, సూత్‌మాన్‌గుండు తదితర వాటికి రంగులు, సున్నాలు వేసే కార్యక్రమాన్ని కార్మికులు ప్రారంభించారు. జనవరి 7వ తేదీన ఆలయవర్గాల ఆధ్వర్యంలో నిర్వహించే మల్లన్న కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.స్వామి వారిని దర్శించుకుని బయటకు వచ్చే దారిలో ఉన్న ఎగ్జిట్ గేట్ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ టైల్స్ వేసేందుకు ఆ ప్రదేశాన్ని చదును చేశారు.స్వామి వారి లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయించే ప్రదేశాల్లో చలువ పందిర్లు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేశారు.దీంతో పాటు స్వామి వారి కల్యాణ ఆహ్వాన పత్రికలు 3వేలు భక్తులకు, వీవీఐపీ, వీఐపీలకు పంపించారు. దీంతో పాటు హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, వరంగల్, జనగామ తదితర జిల్లాల్లోని ప్రధాన కూడళ్లల్లో స్వామి వారి కల్యాణం, బ్రహ్మోత్సవాల వివరాల వాల్‌పోస్టర్లను అతికించారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో బాలాజీ మాట్లాడుతూ స్వామి వారి కల్యాణోత్సవ ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్ ఉన్నారు.



పాదాల మండపానికి రంగులు వేస్తున్న కార్మికుడు



బయ్యారం రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ సూపర్‌వైజర్ మహిపాల్

# పత్తి తూకంలో మోసం

**బయ్యారంలో బయటపడిన వైనం**

గజ్వేల్, డిసెంబర్ 26: పత్తి కొనుగోలు చేసేందుకు వచ్చిన దళారి తూకంలో వ్యత్యాసం చేసి మోసం చేశాడు. రెండు రోజులుగా రైతులు పండించిన పత్తిని మెట్‌పల్లికి చెందిన వ్యాపారి రవీందర్ మండల పరిధిలోని బయ్యారంలో కొనుగోలు చేస్తున్నాడు. మంగళవారం రైతులకు తూకంపై అనుమానం రావడంతో వెంటనే గ్రామంలోని మరో కాంటాపై పత్తి బస్తాను తూకం వేయగా 30కిలోల వ్యత్యాసం వచ్చింది. దీంతో రెండు రోజులుగా రవీందర్‌కు పత్తి అమ్మిన వారు మోసపోయామని గుర్తించి వెంటనే స్థానిక పోలీసులు, మార్కెట్ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు, మార్కెట్ సూపర్‌వైజర్ మహిపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతుల వద్ద నుంచి వివరాలు తెలుసుకొని కొనుగోలు చేసిన పత్తిని తూకం వేసి పరిశీలించారు. రెండు రోజులుగా రైతుల వద్ద నుంచి సుమారు రూ.9లక్షల విలువైన పత్తిని క్వింటాల్‌కు రూ.7వేల చొప్పున చెల్లించి కొనుగోలు చేశాడు. క్వింటాల్ పత్తిలో 30 కిలోల వ్యత్యాసం రావడంతో పత్తి రైతులకు క్వింటాల్‌కు 30కిలోల వరకు వ్యాపారి రూ.3.14లక్షలను చెల్లించాడు. మార్కెట్ లైసెన్స్ లేకుండా కొనుగోలు చేయడంతో మార్కెట్ సూపర్‌వైజర్ మహిపాల్ వ్యాపారికి రూ.10వేల జరిమానా విధించాడు. తూకం లో జరిగిన మోసాన్ని పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు తునికల కొలతల అధికారులకు సమాచారం అందించామని, తర్వాత దళారి వ్యాపారి రవీందర్‌పై చర్యలు తీసుకుంటామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

# బలేశ్వర్‌నాథ్ ఆలయంలో పూజలు

**నేపాల్‌లో పర్యటిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే**



నేపాల్‌లో పర్యటిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 26: బలేశ్వర్‌నాథ్ ఆలయంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నేపాల్ దేశ పర్యటనలో ఉన్న ఆయన ఖాట్మండు సమీపంలోని చంద్రగిరి పర్వతాలపైన ఉన్న బలేశ్వర్ మహాదేవ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భారత దేశం నుంచి వచ్చిన ఎమ్మెల్యేను గుర్తించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను నేపాలి సంప్రదాయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేపాల్‌లోని బలేశ్వర్‌నాథ్ దేవాలయానికి రావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. భారతదేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నానని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు బాగుండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు పాండు పాల్గొన్నారు.